# కలుపుమొక్క

ఒక్కోసారి ఈ ప్రపంచం ఎంతో అందంగా కనిపిస్తూ ఉంటుంది నాకు- ముద్దబంతి పువ్వులాంటి కన్నెపిల్ల సిగ్గులాగ. ఆ సమయంలో ఈ సృష్టిలోని సౌందర్యం, జీవితంలోని తీయదనం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. నలువైపులా ఆనందమే నాట్యం చేస్తున్నట్టు అనిపిస్తుంది. ఒక్కోసారి ఈ జగత్తు వికృతంగా కనిపిస్తుంది నాకు పిచ్చివాడు గీసిన బొమ్మలాగ. ఆ సమయంలో ఈ ప్రకృతిలోని బీభత్సం, ఈ బ్రతుకులోని కటికచేదు నన్ను కలవరపెడతాయి. . ఈ ప్రపంచంలో ఎంత వేదన దాగిఉంది! అనిపిస్తుంది. అటువంటి వేళల్లో సంఘంలోని పతితులపట్ల, భ్రష్టులపట్ల విపరీతమైన జాలి కలుగుతుంది. అయితే ఆ జాలి ఊహా మాత్రమేనని, ఏ అభాగ్యుని పట్లా నా హృదయం కరిగికన్నీరైపోలేదనీ నాకు తెలియలేదు. ఒకవ్యక్తి నాకర్థమైనదాక.

వాడు మా పాలేరు. మాఇంటికి నమ్మినబంటు. వాడి శరీరం రాతికన్నా కఠినమైంది. వాడి హృదయం వెన్నకన్నా సుతిమెత్తనిది. ఆ హృదయం చిరకాలం నుండి మా ఇంటి సుఖదుఃఖాలలో పాలు పంచుకుంది. మా ఇల్లు సుఖసంతోషాలతో తులతూగినప్పుడు అది వేయిరేకుల పుష్పంలాగ వికసించింది. మా ఇల్లు కలతల పాలైనప్పుడు అది కరిగిపోయింది. నేను పుట్టకముందునుంచీ వాడు మా పొలంలోనే పనిచేస్తున్నాడు. నేను పుట్టి ఇన్నేళ్ళయినప్పటికీ వాడు మాయింటినే అంటిపెట్టుకుని ఉన్నాడు. ఉంటాడు. వాడిపేరు చిన్నోడు. వయసులో చిన్న కాకపోయినా తల్లిదండ్రు లకు కడగొట్టు సంతానం కావటంచేత ఆ పేరు వాడిపట్ల ఎప్పటికీ సార్థకమే.

చిన్నోడికి ఒకే కొడుకు, ఒకే కూతురు. ఒకే భార్యకూడాను. ఎందుకంటే పెళ్ళాం పిచ్చిదైనా అది బ్రతికి ఉన్నన్నాళ్ళూ దాన్ని పోషించాడు. అది చనిపోయిం తర్వాత మరి దేన్నీ పోషించలేదు. కొడుకు కంటే కూతురు నాలుగైదేళ్ళు పెద్దదనుకుంటాను. ఏనాడో దానికి పెళ్ళయింది. ఏనాడో దాని భర్తపోయాడు.

చిన్నోడి గుడిసె మా పొలంలోనే ఒక మూలన ఉంది. దూరానికి కనిపించే విధంగా అందంగా వుండదు. వర్షానికికాని, వడగాలికి గాని ఆ పూరిగుడిసె, ఆ చిల్లుల తడికెలు

ఏవిధంగానూ అడ్డురావు.

చిన్నోడు నాకు చాలా చిన్నతనం నుంచీ తెలుసు. కొన్ని కొన్ని దృశ్యాలు ఇప్పటికీ నా కళ్ళముందు కదలాడుతూ వుంటాయి. ఊహ తెలియని వయసులో నన్ను ఆడిస్తూ భుజంమీద ఎక్కించుకుని తిప్పుతూ ఉండే వాడని ఇప్పటికీ లీలగా జ్ఞాపకం. కొంత వయసు వచ్చిన తర్వాత పొలానికి వెళ్తే కథలూ, కబుర్లూ చెబుతూ వుండేవాడు. మధ్యమధ్యలో ఒక్కసారిగా గలగలా నవ్వే వాడు గోదావరి వరదలాగ. వాడి రంగు నలుపు. కాకికన్నా నలుపు. కానీ వాడి నవ్వు తెలుపు. వెన్నెలకన్నా తెలుపు. వాడలా బిగ్గరగా నవ్వుతుంటే ఆ నవ్వులో వాడి నిర్మలమయిన అంతరంగం ప్రతిధ్వనించేది. అంత ఉల్లాసంగా వుండేవాడు చిన్నోడు.

పనిలో ఒళ్ళు దాచుకోవటం వాడికి చేత కాదు. ఎద్దులాగ పనిచేసేవాడు. తోటిపని వాళ్ళను కూడా మాటిమాటికీ హెచ్చరిస్తూ వుండేవాడు. గింజలు తూర్పారబోస్తున్నప్పుడు "ఒలియొ ఒలియో..." అంటూ సర్వరాగ సమ్మిళితమైన గొంతెత్తి పాడు తుంటే మా కొట్టంలోని ఆవులూ, గేదెలూ అర్రెత్తిచూసేవి. ఆ రాగానికి కాదు, ఆ కంఠస్వరానికి. మా గిత్తలకు చిన్నోడిదగ్గరే మాలిమి ఎక్కువ. వాటిని ఏనాడూ నోటితోనేగాని ముల్లుగర్రతో అదల్చడు. మాకున్నకోడెదూడల్లో మాంచి పొట్లగిత్త ఒకటి ఉండేది కొంతకాలం క్రిందట. అది చిన్నోడి మాటతప్ప మరెవ్వరిమాటా వినేది కాదు.

చిన్నోడు ఎంత పనిచేసేవాడో అంత తిండీ తినేవాడు. వాడి భోజనపరాక్రమం సామాన్యమైందేమీ కాదే. నారింజకాయ సామాన్యమైందేమీ కాదే. నారింజకాయలంతేసి ముద్దలు వాడు గుటుక్కున మింగుతుంటే చిన్నతనంలో నాకెంతో ఆశ్చర్య మేసేది.

చిన్నోడు కొడుకు పేరు కొండయ్య. దాదాపు నా ఈడువాడే. చామనచాయ. అంత అందంగా ఉండడు. కానీ వాడి కళ్ళల్లో ఏదో ఒక వింత కాంతి తళుక్కుమంటూ వుంటుంది. చిన్నతనంలో ఇద్దరం కలిసి ఆడుకుంటూ వుండేవాళ్ళం. అప్పుడు నేను రౌతును, వాడు గుర్రం. నేను రాజు, వాడు ఏనుగు. ఈవిధంగా ఉండేవి మా ఆటలు. అప్పుడప్పుడు కోపం వస్తే నాలుగు తంతూ వుండేవాడిని. కాస్సేపు ఏడ్చినా మళ్ళీ నాదగ్గరకే వచ్చేవాడు ఆడుకోవటానికి. వాడికి చదువుమాత్రం అక్షరం ముక్క అబ్బ లేదు. తత్ఫలితంగా బళ్ళో పంతులుగారి బెత్తం దెబ్బలనూ, చిన్నోడి పీసె గుద్దుల్నీ వాడి బలహీనమైన వీపు భరించవలసివచ్చేది. కొంచెం పెద్దయిన తర్వాత కొండయ్యను మా పొలంలోనే పనికి అంటగట్టాడు చిన్నోడు. నేను హైస్కూల్లో చదివే రోజుల్లో ఇంటికి వచ్చినప్పుడల్లా వాడి ముందు నా గొప్పతనం ప్రదర్శించేవాడిని. నేను ఎంత పెద్ద చదువు చదువుతున్నానో ఇంకా ఎంతెంత పై చదువులు చదివి మా ఊరికి కలెక్టరు కాబోతున్నానో వివరించి చెప్పేవాడిని. ఆ సమయంలో వాడి కళ్ళు ఆశ్చ ర్యంతో విప్పారి, మెరిసిపోతూ వుండేవి. అప్పుడు మాత్రం తనకు చదువురానందుకు కాస్సేపు విచారపడేవాడు. నా

తెల్లటి బట్టల వంక అలాగే కళ్ళార్పకుండా చూస్తూ వుండేవాడు. అటువంటివేళలో చింకిబట్టల్లో జిడ్డోడుతున్న శరీరంతో ఉన్న కొండయ్య కంటే నేను ఎన్నోరెట్లు ఎదిగిపోయేవాడివి.

కాని కాలేజీ చదువులకు పట్నం వెళ్ళేసరికి నా పరిస్థితి మారింది. ఎప్పుడన్నా ఇంటికి వచ్చినా కొండయ్యను పలకరించాలంటే చిన్నతనంగా వుండేది. వాడే నన్ను చూడగానే పలకరించేవాడు. ఆ క్షణంలో వాడి కళ్ళు తళ్ళుక్కుమనేవి. అయితే ఆ పలకరింపులో లేని వాత్సల్యం చిన్నోడి పలకరింపులో వుండేది. వాడికి నా మీద వున్నంత స్థాయిలో కాకపోయినా నాకూ అంతో ఇంతో చిన్నోడిమీద అభిమానం వుండేదనుకుంటాను.

అవి నేను ఎం.ఏ. చదివే రోజులు. పండగ సెలవలకు మా ఊరు వచ్చేను. ఊరు చిన్నదే. చిన్నూరైనా రెండు పెద్ద పార్టీలు ఉన్నాయి. రెండు పెద్ద పార్టీల్ని ఇద్దరు పెద్ద భూస్వాములు పోషిస్తూన్నారు. ఆ ఇద్దరిలో ఒకరు మా ఊరి ప్రెసిడెంటు, మరొకరు మా తండ్రి. ఇద్దరికీ కావలసినంత బలగం వుంది. ఆ బలగానికి కాలక్షేపంగా కక్షలూ, కావేషాలూ, పోట్లాటలూ, కొట్లాటలూ పుష్కలంగా వున్నాయి. అయితే చిత్రమేమిటో గాని ఆ యేడు మా ఊళ్ళో పండగ సంబరాలు ఎన్నడూ లేనంత ప్రశాంతంగా, ఘనంగా జరిగాయి. సంబరాలకు డప్పు వాయించటం ఏనాటినుంచో చిన్నోడి కుటుంబానికి అనవాయితీ. ఆరోజు డప్పు వాయిద్యంలో తన విద్యనంతా ప్రదర్శించాడు. ఇద్దరు ముగ్గురు తప్పతాగినవాళ్ళు చిన్నోడి డప్పు వాద్యానికి చిందు కూడా వేశారు. సంబరాలు ముగిసేసరికి రాత్రి పదిన్నర గంటలయింది. పండగ హడావుడి కాబట్టి ఆ రోజంతా నాకు వాడితో మాట్లాడే అవకాశం చిక్కలేదు. ఆనాటి రాత్రి చిన్నోడు ఒళ్ళు తెలియకుండా తాగినట్టు నాకు తెలిసింది. నేను కొంచెం బాధ పడిన మాట నిజం. ఎందుకంటే నాకు ఊహ తెలిసినప్పటినుంచీ నోట్లో కొడిగట్టిన చుట్టతో గుప్పు గుప్పున పొగ వదులుతూ ఉండటం తప్ప మరేవిధమైన దురలవాట్లూ వాడికున్నట్టు నాకు తెలియదు.

మర్నాడు సాయంకాలం నేను మా పొలాలవైపు షికారుగా వెళ్ళాను. అంతో ఇంతో పట్టణవాతావరణానికి అలవాటు పడిపోయిన నాకు ఆ పచ్చని పైరుల అందచందాలు, స్వచ్ఛమైన పిల్లగాలులు చాలా ఆహ్లాదాన్ని కలిగించాయి. పడమటి కొండల్లో సూర్యుడస్తమించాడు. కనుచీకట్లు నలువైపుల అలముకుంటున్నాయి. నేను తిరిగి ఇంటికి మరలాను. మా దక్షిణపు పొలం మలుపు తిరుగుతుండగా గుడిసె వద్ద చిన్నోడు కనిపించి దగ్గరకు వచ్చాడు. కాసేపు కూర్చుని వెళ్ళండని ఆహ్వానించాడు. ఇద్దరం వాడి పూరిగుడిసెవద్దకు వెళ్ళాం. గుడిసెకు అన్చి నిలబెట్టి ఉన్న కుక్కిమంచం వాల్చాడు. ఆ మంచం పట్టెమీద ఆనీ ఆననట్టుగా కూర్చున్నాను నేను. లోపల చిన్నోడి కూతురు వంటచేస్తూ ఉంది కాబోలు గుడిసెలో నుంచి సుళ్ళుసుళ్ళుగా పొగలు లేస్తూ ఉన్నాయి. నా కాళ్ళవైపుగా నేలమీద చతికిలబడ్డాడు చిన్నోడు. నేను మౌనంగానే కూర్చుండిపోయాను. చిన్నోడే

సంభాషణ ప్రారంభించాడు. నా చదువును గురించి అడిగాడు. వాడి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం ఇచ్చాను. చిన్నోడు ఇంకేమీ అడగలేదు. ఈ సారి నేనే వాడిని ప్రశ్నించాను.

"రాత్రి తప్పతాగావు గదూ?"

చిన్నోడు మాట్లాడలేదు.

"తాగుడెప్పటినుంచి నేర్చుకున్నావ్?"

చిన్నోడు మాట్లాడలేదు. తలవంచుకుని ఉండిపోయాడు. నాకు చిరాకువేసింది. చిట్ట చివరికి చిన్నోడు ఇలా అన్నాడు.

"మా బుడ్డోడు సచ్చిపోయాడయ్యా!"

ఉలిక్కిపడ్డాను నేను. ఇది నేను ఊహించని పరిణామం. అది నా ప్రశ్నకు జవాబు కాదు. కానీ అదే నా ప్రశ్నకు జవాబు. అప్పటిదాకా కొండయ్య విషయమే జ్ఞప్తికి రానందుకు నన్ను నేను నిందించుకున్నాను.

"కొండయ్య చనిపోయాడా? ఎప్పుడు? ఏమయింది?"

"నాలుగు నెల్లయిందయ్యా సచ్చిపోయి. పెసిడెంటు పార్టీ వోళ్ళకి మన పార్టీ వోళ్ళకి సేనుగట్టుకాడ తగాయిదా అయింది. మాట మీద మాట పెరిగి కొట్లాటదాకా పోయింది. మా వోడు కూడా అక్కణ్ణే ఉండాడు. తగాయిదా సర్దటానికెల్తే అన్నేయంగా కర్రల్తో బాదారు. తల పగిలిపోయి నెత్తురు కొల్లైపోయింది. ఆసుపత్రిరికి తీసికెళ్ళినా బతకలేదు. సమయానికి నేనక్కడున్నా ఆణ్ణి కొట్టాటకి రాకుండా ఆపేవోణ్ణి. ఇప్పుడేమనుకొంటే ఏం లాబం? అంతా అయిపోయింది. ఎవురికి సెప్పుకునేదయ్యా? రొండు పార్టీలవోళ్ళూ సల్లంగనే వుండారు. మద్దెలో పాపం పున్నెం ఎరుగనోడు సచ్చిపొయ్యాడు ఎంత దర్మమో సూడయ్యా!"

నేను నిశ్చేష్టుడినై అట్లాగే వింటూ ఉండి పోయాను. చిన్నోడి కళ్ళనుండి జలజలా కన్నీళ్ళు పొంగి కృశించిపోయిన చెంపల మీదుగా జారి, వాడి గడ్డంలో ఇంకి పోయాయి. బహుశా ఆ సమయంలో నా కళ్ళుకూడా కొంచెం తడిసి ఉండాలి.

"అది మొదలు పండ గొచ్చినా, పబ్బ మొచ్చినా వాడు కంటి కెదురుగా కన్పడక పొయ్యేతలికి ఏందో కడుపులో దేవేసినట్టుంటాదయ్యా! ముద్ద గొంతు దిగదు, కంటిమీద కునుకురాదు. ఆ దిగులు మరిసిపోటానికే నిన్న తాగాను. సేతికం దొచ్చిన కొడుకట్టా గయ్యాడు కూతురు బతుకేమో ఇట్టాగయి పోయింది. అదేమో ముందే నన్నొదిలేసి పోయింది. ఏందోనయ్యా! ఈ జల్మంతా ఇట్లా ఎల్లిమారాల్సిందే."

నా మనస్సు కకావికలమై పోయింది.

చీకటి పడింది. చుట్టూరా జుట్టు విరబోసుకున్న చీకట్లు. చీకట్లలో ఆ పూరి గుడిసె. దూరాల నుండి పొలాల మీదుగా సువాసనల్ని మోసుకుంటూ వచ్చి చల్లగా పలకరిస్తున్న పడమటి గాలి. ఆ ప్రశాంత సమయంలో నాకెదురుగా చిక్కటి చీకటిలో లీనమైన ఒకానొక

మానవ హృదయపు వేదనా స్పందనలను నేను వినగలిగాను.

ఆ మర్నాడు నేను తిరిగి పట్నం వెళ్ళాను. చదువులో మునిగిపోవటం వలన చిన్నోడి హృదయ విదారక గాథ కొంత వరకు మర్చిపోగలిగాను. నేనెంతో అదృష్ట వంతుడిని. నా జీవితంలో ఎప్పుడూ చిన్నోడికి కలిగిన అనుభవాల వంటివి కలగ లేదు. కొందరి జీవితాలింతే అవి నల్లేరు మీద బండిలా ఒడిదుడుకులు లేకుండా సాగి పోతాయి. మరి కొందరి జీవితాలు అంతే. అవి కలతలతో కన్నీళ్ళతో నిరంతరం ప్రవహిస్తూ ఉంటాయి.

చిన్నోడు ఇప్పటికీ ఉన్నాడు. వాడి కిప్పుడు డెబ్బయ్యేళ్ళు పైబడ్డాయి. తలంతా నెరసి పోయింది. కంటి కింద నల్లటిచారలు ఏర్పడ్డాయి. జవసత్వా లుడిగిపోయాయి. వార్థక్యం వాడి శరీరాన్ని పూర్తిగా జయించింది. ఇప్పటికీ వాడు తన పాడు గుడిసెతోనూ, గుడిసెలోని చీకటితోనూ జీవయాత్ర సాగిస్తూనే ఉన్నాడు.

ఈనాటికీ చిన్నోడు మా పొలంలో ఎండనక వాననక శ్రమిస్తూ బ్రతుకుతూనే ఉన్నాడు- బ్రతకాలి కాబట్టి. కానీ ఆ శ్రమలో ఒకనాటి ఉత్సాహం లేదు. ఇప్పుడు కూడా వాడు మాఇంటి గోడలు బీటలు వారేలాగ గలగల నవ్వుతూనే ఉంటాడు. కానీ ఆ నవ్వులో మునుపటి జీవకళ లేదు. ఈనాటికీ చిన్నోడు నన్ను వాత్సల్య నిర్భరమైన హృదయంతో పలకరిస్తూనే ఉంటాడు. కానీ వాడి కంఠస్వరంలో అంటి ఉన్న దుఃఖపు జీర నన్నెప్పటికీ కదిలిస్తూనే ఉంటుంది.

*• ప్రజా తంత్ర వారపత్రిక, 10 ఏప్రిల్ 1977 •*